కథానిక

ఎడారిపూలు

శ్రీ చిరంజీవి

౧

ఆఖ్యాత

సుబ్రహ్మణ్యం పట్నాని కొచ్చాడు. అడుగడుగునా దీపావళి సరకులే కనిపిస్తున్నాయ్. దుకాణాల నిండా పెద్దవాళ్లతో పాటు తిరుగుతూ, కళ్లనిండా ఆశలు పెట్టుకుని నవ్వుతూన్న చిన్నపిల్లల ముఖాల్నే సుబ్రహ్మణ్యం చూస్తున్నాడు.

వెంటనున్న పిల్లలు వీలుకొద్దీ మారాం చేస్తున్నారు. అది వినకుండా 'అదెందుకూ, ఇదెందుకూ, ఇది చాల్లెద్దూ' అంటూ వెళ్లిపోయే పెద్దవాళ్లని కాస్త ఆపేసి, "—ఏమండీ! ఇవాళ కాకపోతే మరెప్పుడు వాళ్ల ముచ్చట తీరుస్తాం? వ్వండి! పాపం! వాళ్లు నోరు తెరచి అడిగితే కొనివ్వద్దటండీ?" అనేవాడు సుబ్రహ్మణ్యం.

ఈ ఆగంతుకుణ్ని చూసి పిల్లలు సంతోషంతో మరింత మారాం మొదలు పెట్టేవారు. ఈ కొత్త బెడద ఎక్కడ దాపురించిందని విసుక్కుంటూ, మరి కొంత సామగ్రి కొనుక్కుని 'వొస్తామండే' అని చెప్పి పెద్దవాళ్లు వెళిపోయేవాళ్లు. సుబ్రహ్మణ్యం వొళ్లు పొంగి మనసు గిలిగింత పెట్టేది.

తనూ ఒక పిల్లను ఆంతరంగికంగా పెంచుతున్నాడిప్పుడు. తన ప్రైవేటు స్కూల్లో కల్లా ఆ అమ్మాయి బాగా చదివేది. ఎన్నో తరాలనించీ కలిసిపోయిన ప్రేమవంటి ప్రేమ అతనికా అమ్మాయిమీద కలిగింది. పిట్టకథలు చెప్పి, కబుర్లు చెప్పి ఆ అమ్మాయిని సంతోష పెడుతున్నాడు. ఆ అమ్మాయి నవ్వులో తను కరిగిపోతూన్న మంచుబొమ్మనుకునేవాడు.

ప్రతి దీపావళికి అతను ఇంతో అంతో సరుకు కొనడం, ఎవరికో ఒకరి కిచ్చి కాల్పించి వాళ్ల సంతోషంలో తనూ భాగం పంచుకుని పోతుండేవాడు. ఈ ఏటి దీపావళికి మరెవరికీ యివ్వక్కర్లేదు. ఇప్పుడాతని హృదయంలో యీ అమ్మాయి పూర్తిగా నిండిపోయింది. ఆ అమ్మాయిపేరు పద్మ. పట్నమంతో తిరిగితిరిగి జీతంతాలూకు మిగిలిన పైకంతో రకరకాల సామగ్రిఅంతా తాటాకుబుట్టలో పెట్టించుకుని బయల్దేరాడు.

౨

సుబ్రహ్మణ్యం.

ఓపక్క పొద్దు పోతూవుంది.

రోడ్లమీది దుమ్మునీ, హోటళ్లూ దుకాణాలూ చేసే గోలనీ ఎందాక భరించగలం? ఇంటి కెప్పుడు వెళదామా అన్న ఆదుర్దా. వొళ్లంతా కళ్లు చేసుకుని ఎంతచూసినా వినాయకుడి విగ్రహంతప్ప సిటీ బస్సు కనిపించదాయె.

దీపావళి సరకు తెస్తాననీ, చక్కా కాల్చుకుందామనీ ఆశపడి, నాకోసం ఎదురుచూసి చూసి ఏమనుకుంటుందో పద్మ! పక్కింటిలో మూర్తిగారమ్మాయిలూ, అబ్బాయిలూ దివ్యంగా దీపాలు వెలిగించి మతాబాలు కాల్చుకుంటూంటే, తను ఉసూరుమనుకుంటూ మొగం వేళ్లాడేసుకుంటుంది పాపం!

వొచ్చింది బస్సు కడుపులో పొర్లు వొచ్చినట్లు ఎక్కే దిగే జనంతో తన్నుకుంటోంది. 'ఎక్కొద్దు మొర్రో' అని కండక్టర్ కాకిగోల! ఐతేనేం? ఎక్కనే ఎక్కారు గుంపుగుంపంతా. ఇంకెక్కడ ఊపిరాడుతుంది? బస్సు మలుపు తిరిగి సెంటర్‌కి వస్తోంది. పాపం కండక్టర్ ఊరికే గొణుక్కుంటున్నాడు. సార్జెంట్ తన మీద పగబట్టాడనీ, పట్టుకుంటే కేసు తప్పదనీ. హరిరామ! అనుకున్నంతా అయింది. బస్సు ఆగిపోయింది. ముందు పోలీసులు. ఆవెనుక సార్జెంట్! ప్రయాణీకుల్ని గూట్లో కోళ్లని లెక్కేసినట్లు వేస్తున్నారు. కండక్టర్ మొగం నీళ్లు కారిపోతోంది.

నిజానికి ఈ పోలీసుల పీడ మశూచికం, కలరాలకన్నా భయంకరమైనది. కేసులు కోర్టులు.. జైళ్లు మరి శత్రువుకైనా వొద్దు!!

"మళ్లా కోర్టుదాకా ఎందుకు? కాస్త చేయి తడిచేసి లేదనిపించరా తమ్ముడా!"—అనుభవజ్ఞుడైన ఓ పెద్దమనిషి ఉచితసలహా ఇస్తున్నాడు.

అంతా మాయాబజారు!

ఇవాళే రావాలీ ఈ తద్దినం కూడా! ఏమనుకుంటూందో ఇంటికాడ అమ్మాయి? కొంపతీసి నేను సినిమాకి వెళ్లాననుకుందా? మరి చెప్పవే? వాళ్లమ్మమీద అలగడమేనా? అల్లరల్లరి చేయడమేనా! ఒక పట్టాన యీ లోకంలో కలిసే మాట వొకటి తాతలు దిగి రావలసిందే! ఐనా—ఏం సినిమా లున్నాయని చూస్తాం! తెలుగు దేశానికి నడిబొడ్డన్న మాటే గాని, విజయవాడలో అరవ సినిమాల కున్న పంకుబడీ, రాబడీ తెలుగువాటికి లేనేలేదు. రాగా, పోగా ఈ చాప్లిన్ చిత్రం ఒకటి వుంది మీ రేమన్నా అనండి చాప్లిన్ బొత్తిగా చెడిపోయిన ట్టుంది. ఏమాత్రమో కమ్యూనిస్టు వాసన తగిలినట్టుంది. బంగారం వంటి అమెరికా భూతలస్వర్గంలో ఈ దూడేకు డేమిటి? ప్రభుత్వం కూడా తగిన మందు వేసినట్టు వింటున్నాను. హాలీవుడ్‌లో ఆడా, మగా అందర్నీ అరెస్టు చేస్తున్నారట! మంచి పని చేశారు. అమ్మా! చాప్లిన్‌లాంటివాళ్లు ఓ నాలుగు చిత్రాలు తీస్తే ఇంకేముంది? అమెరికా నెత్తిన నెప్పలగుండం పట్టినట్టే!

ఇంకా వొదల్లేదు యీ పోలీసులపీడ. వీళ్లకి గాంధీటోపీ లన్నా పెడితే—వెనకటి బుద్ధులు మారతయ్యేమో? సుమతీశతకంలో యీ విషయం రాయలేదు! బస్సులో ఎక్కువ మంది ఉంటే పోలీసులు పట్టుకుంటారు. రోడ్డుపక్కన నడిచినా పట్టుకుంటారు. మరేం చేస్తే పట్టుకోరో తెలీడం లేదు!

3

ఆఖ్యాత:

జీవయాత్రలో ఎన్నిసార్లు పైకి తెలీకుండా గుండెల్లో గుండునూదుల్తో గుచ్చినంత కష్టాలు వొచ్చినా—సుబ్రహ్మణ్యం నిశ్శబ్దంగా అనుభవించాడు. సహనమూ, సంస్కారమూ చదువుల వల్లా, వాతావరణంవల్లా అతనికి రాలేదు. జీవితంలో ఒక్కొక్క దెబ్బతింటూనే ఒక్కొక్క మెట్టు పైకి ఎక్కొచ్చాడు. ఎన్ని విషాద ఘట్టాలు అతను మరిచిపోయినా, 'దీపావళి' మాత్రం అతనికి మానని ఎర్రపుండయిపోయింది.

సుబ్రహ్మణ్యంతండ్రి ఇలాంటివాడని చెప్పేందుకు భాష చాలదు. ఓ పెత్తందారీతనమూ, పల్లెటూరికు సంస్కారమూ, అహంకారమూ కలిసి పోతపోసిన విగ్రహం ఆయన. కొడుకుల్ని అన్నివిధాల సుశిక్షితుల్ని చేయాలని ప్రయత్నించాడు. అందు కాయన ప్రతినిమిషం వాళ్లని చావగొట్టి చెవులుమూయడంద్వారా ప్రయత్నం చేశారు. ఇది శిక్షణ విధానమైతే — దెబ్బలకు వొళ్లంతా కంది, చెమటలుపట్టి కళ్లు మూతలు పడే బిడ్డల్ని వేణ్నీళ్లతో స్నానం చేయించి తన మంచంమీదనే నిద్రబుచ్చడం ఆయన ఏకైక ప్రేమసాధనం! ఏకులదేవత లాయన కిలాంటి సంస్కార మిచ్చారో తెలీదు.

తండ్రి విషయం గుర్తుకొస్తే ఇప్పటికూడా సుబ్రహ్మణ్యానికి వొళ్లు ఝల్లుమంటుంది. గుండె అలిసిపోయి ఆగిన ట్టుంటుంది.

తల్లిలేదు. వేరే ఆడదిక్కు లేదు. తండ్రి అదుపాజ్ఞలలో ప్రతిక్షణం జీవం చచ్చిపోతుండడం ఇద్దర్నీ సుబ్రహ్మణ్యాన్నీ, అతని తమ్ముణ్నీ ఏకం చేశాయి. సాధారణంగా పల్లెటూళ్లలో అన్నాదమ్ములు ఒకరి కొకరు మొదటి శత్రువులు! కాని సుబ్రహ్మణ్యం అన్నాదమ్ములమధ్య ఉన్న ప్రేమ సాధారణమైనది కాదు. తుఫానులో చిక్కుకున్న రెండు నావలవాళ్లు కలుసుకుంటే వారిమధ్య కలిగే సన్నిహితతత్వం ఎలాంటిదో, సరిగ్గా ఇదే అలాంటిదే!

—ఆ వేళ దీపావళి!

పండగ పబ్బాలికి మగవాళ్ల సంసారంలో పప్పులూ, పాశాలూ వుండ వెలాగూ? సరికదా, ఈ సుశిక్షిత మందిరం నంచి తండ్రి అనుజ్ఞ లేనిది పిల్లికూడా బైటికి పోవడానికి దారి లేదు. బైట కాలుతున్న మతాబాలు, చిచ్చుబుడ్లు—కీటి ఆకారవికారాలు ఊహించుకుంటూ గదిలో పడి వుండాలసిందే ఇంట్లో జీవాలు.

"—నాన్న బజారు కెళ్లాడు. నేను కూడా కాస్త బజారుకి వెళ్లొస్తా నన్నయ్యా!"

"—నాన్న కొడతాడేమోరా!"

"వూఁ— రోజూ వుండే దెబ్బలేగా! వాళ్లంతా మతాబాలు కాలుస్తుంటే చూడకుండా ఎలాగురా, నాన్న రాకముందే వొచ్చేస్తారా?"—

తమ్ముడిమొఖంచూసి, సుబ్రహ్మణ్యం ఏమంటాడు?

"బట్టలవీ జాగ్రత్త! వెళ్లు. నువ్వెళ్లినట్టు నాన్నకి తెలిసిందా మన వీపులు చెడతాయి."

తమ్ముణ్ని వెళ్లమని పంపాడేకాని సుబ్రహ్మణ్యానికి భయం దెయ్యంలాగ పట్టుకుంది. కాని యీ పంజరం బతుకు గుర్తుకువచ్చి కళ్లు తుడుచుకున్నాడు. బహుశా తల్లి గుర్తుకు వచ్చి వుంటుంది.

రచ్చ సావిట్లో 'కాశీమజిలీలు' చదువుతూంటే ఎవరో తూటా వేశారు. అంతటితో అది సరిపెట్టి ఆ అప్రత్యక్ష నరకాసురుణ్ని ఏడుతరాలదాకా శాపనార్థాలు పెడుతో తండ్రి ఇంటికి వొస్తున్నాడు. సుబ్రహ్మణ్యం హడలిపోయాడు.

ఎంతో వ్యవధి లేకుండానే, ఒకటి రెండు ప్రశ్నలతోనే తండ్రి తన శిక్షణా విధానాన్ని అమలుజరిపి ఆ ఇంటిని ఆవరించుకొని వున్న 'తండ్రుల గౌరవాన్ని' కాపాడుకున్నాడు.

* * *

మరి రెండు గంటలు గడిచినవి. సుబ్రహ్మణ్యం హఠాత్తుగా లేచాడు. ఇంట్లో హడావుడిగా వుంది. కళ్లు తెరిచి చూశాడు. ఇంటినిండా జనం. లాంతర్లు ఒకటి, రెండు, మూడు. జనంమధ్య చాపమీద తమ్ముడు వాలిపోయిన రెప్పలనుంచి తనవంకే చూస్తున్నాడు. కన్నీటిచారలు స్పష్టంగా కనిపిస్తున్నై. తనని పిలుస్తున్నట్టుగా చిన్న మూలుగుకూడా వినిపించింది.

ఏం జరిగిందో తెలీదు. ఇంతలో ఎవరో చెబుతున్నారు జరిగిన విషయమంతా.

షావుకారు రంగయ్య కొడుకుని హెడ్మాష్టరు ఎప్పుడో కొట్టాడట! అది మనసులో కక్షపెట్టుకుని కసి తీర్చుకోవాలని చూస్తున్నాడంట; ఇవాళ దొరికింది సమయం. పొద్దుగూకే ముందే ఓ డజను తూటాలనుకొని బయల్దేరాడట. దోవలో రాముడు (తమ్ముడు) కనిపించాడు. "ఏఁరోయ్, తూటాలు కాలుస్తావురా!" అని అడిగాడు షావుకారబ్బాయి.

ఊరికినే వొస్తే కాల్చడానికేఁలే!—అనుకుని సరే! తెమ్మన్నాడట రాముడు.

'ఐతే—నువ్వు యీ గంగరావిచెట్టు ఎక్కి కూచో! ఇవిగో రెండు తూటాలు—నిప్పు, తాడు మరి—నేను యీల వేయగానే తూటా వెలిగించి కిందికి వొదులు' అని పురమాయించి చెట్టెక్కించాడు. మొదట కాస్త భయం వేసినా చివరికి 'సరే' అని చెట్టెక్కాడు రాముడు.

కాసేపటికల్లా 'యీల' వినపడింది. వెంటనే రాముడు తూటా అంటించి కిందికి వొదిలాడు. ఏముంది! ఆ తూటా వెలుగులో చూస్తే 'హెడ్ మాష్టర్' గుర్తుపట్టాడు రాముడు. కాళ్లు చేతులు గడగడలాడి వొణికి, చెట్టుమీది నించి నేలమీద పడ్డాడు.

ఈ విషయం వింటూన్న సుబ్రహ్మణ్యానికి వొళ్లు రాయిగా మారుతున్నట్టనిపించింది.

తమ్ముడి వొంటిని ఎక్కడా గాయం లేదు. మెడ వాలిపోతోంది. స్పృహమాత్రం తప్పలేదు.—కాని చెవినించి ధారావాహినిగా నెత్తురు వొస్తోంది. ఎన్ని గుడ్డలు కడుతూన్నా తడిసి ముద్దయి పోతున్నాయి.

పల్లెటూళ్లో డాక్టరెక్కడ దొరుకుతాడు? పొద్దుపోవడంచేత జనం క్రమేణా తగ్గుతున్నారు. మందూ, మాకులు ఏవీ లేవు.

తండ్రిమొఖం వంక చూస్తున్నాడు సుబ్రహ్మణ్యం. తరతరాలనుంచీ కాపాడు కొస్తూన్న 'తండ్రుల గౌరవాన్ని' ధిక్కరించిన తమ్ముడిమీద తండ్రి కెంత కోపం పెరుగుతోందో సుబ్రహ్మణ్యం విస్పష్టంగా తెలుసుకున్నాడు. ఉండి ఉండి తండ్రి ఉన్మాది యైపోతున్నాడు. తుదకు మృత్యుశయ్యమీద వున్న సంగతిని కూడా తండ్రి కళ్లు చూడడం మానేశాయి. సుబ్రహ్మణ్యం కళ్లు మూసుకున్నాడు—తలవని తలంపుగా భయంకర పిశాచం ఎదురైతే ఎలాగో—అలా.

'ఏఁవిరా—నేను ఇల్లొదిలి వెళ్లొద్దంటే ఎందు కెళ్లావురా, గాడిదా?'

ఫెళ్, ఫెళ్ మని మరి రెండు దెబ్బలూ ఎదటింటిగూట్లో ఆముదందీపం ఆరిపోతున్నట్టు, దెబ్బలమధ్య, అణగారిపోతూ ఆరిపోతున్న గొంతుతో 'నా—న్నా' అన్న మూలుగు మాత్రం సుబ్రహ్మణ్యం విన్నాడు.

తెల్లవారక ముందే తమ్ముడి శవాన్ని తీసుకుపోయారు!!

౪

ఊరుమారినా, జీవితం మారినా సుబ్రహ్మణ్యం యీ విషాదగాథని ఇవాళ గుర్తు చేసుకుంటున్నాడు. ఆకాశంనుంచి తాచుపాముల్లే చీకటీ, భూమ్మీదినుంచి మతాబాల వెలుగూ పోటీపడి చక్కని దృశ్యాల్ని కలిపెస్తున్నాయ్. వెలుగూ, చీకట్లూ కలిసిన చోట రకరకాల రంగులు పుట్టి క్రమేణా చీకట్లో కలిసిపోయి మెరు గెక్కుస్తున్నాయ్.

దారివంట చెట్లనుంచి జారి నేలను కౌగలించుకుంటున్న చిమ్మచీకట్లో సుబ్రహ్మణ్యం ఇంటి కొచ్చేసరికి చాల పొద్దుపోయింది. గూళ్లల్లో దీపాలన్నీ కొడిగట్టి పోతున్నాయి.

'పద్మ' ఇంటిముందు నిలబడి తలుపుకొట్టాడు. కాసేపటికి పద్మతల్లి తలుపు తీసింది, చూడ్డంతోనే ఆమె ఆశ్చర్యపడింది.

ఆమె చెప్పింది "మీకోసం చాలసేపు ఎదురు చూసి, చూసి, ఆఖరికి ఏడ్చి నిద్రపోయింది. వాళ్లనాన్నా, నేనూ ఎంత బతిమాలినా అన్నమన్నా తినకపోయింది!"

పద్మ మంచమ్మీద కూచుని లేపాడు. అమ్మాయి తనని చూసి ఆశ్చర్యపడాలని ఆయన అభిప్రాయం. నలిగిన గులాబీరేకులవంటి కళ్లని తెరిచింది పద్మ.

"ఏం చెయ్యను తల్లీ! ఎంత పెందరాళే వొద్దామనుకున్నా వీల్లేకపోయె! సిటీ బస్సుని పోలీసులు పట్టుకున్నారు. లే—అమ్మా! మతాబాలు కాల్చుకొందువుగాని."

ఇంతలో తల్లి అందుకుని ఇలా అన్నది: "ఇంత పొద్దుపోయాక ఏం కాల్చుకుంటుంది లెండి. రేపు కాల్చుకుంటుంది—"

"ఊఁ—నే నిప్పుడే కాల్చుకుంటాను" అంది పద్మ.

పోనీలే—ఎన్ని ఇబ్బందులు పడ్డా తన దీపావళి కోర్కె తీరుతున్నందుకు ఆత్మసంతృప్తితో సుబ్రహ్మణ్యం తాటాకులబుట్ట మంచం ముందుకు లాగాడు.

దూరాన వున్న దీపాన్ని వొత్తి పెద్దది చేసి తల్లిదగ్గరకు తెచ్చింది.

బుట్టలో వున్నవి మతాబాలూ—మందు సామానులూ కావు. వంకాయలూ, బంగాళా దుంపలూ, మరేవో కూరగాయలూ-దుంపలూ. బహుశా యీ బుట్టల మార్పిడి సిటీ బస్సులో జరిగివుంటుంది.

ప్రపంచంలోని చిక్కని చీకటంతా ఇప్పుడు సుబ్రహ్మణ్యం మొగంమీదా, హృదయమ్మీదా ఆవరించుకుంది. మరి—అతనికి వెలుగులేదు. ఎడారిలో పూలు వికసించలేవు!!

గనోక్వీన్
అన్ని సెగలకు గంటలలో గుణము
ఈశ్వర ఫార్మశీ, రాజమండ్రి